నగరమంతా అస్తవ్యస్తం

ఇటీవల వరుసగా కురిసిన భారీ వర్షాలకు వరదలు పోటెత్తి నగరాన్ని ముంచెత్తాయి. దాంతో నగరమంతా అస్తవ్యస్తంగా మారింది. గురు, శుక్రవారాల్లో వర్షం తగ్గుముఖం పట్టడంతో వరద ఉధృతి కొంతమేర తగ్గింది. లోతట్టు ప్రాంతాలు, రోడ్లపై బురద పేరుకుపోయింది. పునరావాస కేంద్రాల్లోనే వరద బాధితులు ఉన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి వారికి చేయూతనిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సహాయక చర్యలు చేపడుతున్నారు.

- సాక్షి నెట్‌వర్క్


రంగంపేట భద్రకాళి రోడ్డులో సరస్వతి దేవాలయంలో నీటమునిగిన ఇల్లు


నయీంనగర్‌లో బ్రిడ్జి వద్ద ఏర్పడిన గొయ్యి


నయీంనగర్‌లో వాగ్దేవి కళాశాల ఎదుట ధ్వంసమైన ప్రధాన రహదారి


హనుమకొండ జవహర్ కాలనీలో వరద ఉధృతికి ధ్వంసమైన రోడ్డు


రాజీవ్ గృహకల్ప ఇళ్ల నుంచి బయటకు వస్తున్న బాధితులు


హంటర్ రోడ్డులో నీట మునిగిన ఓ ప్రముఖ వస్త్రాలయం


సీఎస్ఆర్ గార్డెన్ ఎదుట మెయిన్ రోడ్డుపై ప్రవహిస్తున్న వరద


విమ్స్ హాస్పిటల్ వద్ద రైల్వే ట్రాక్ వద్ద వరద ప్రవాహం


జవహర్ కాలనీలో ప్రవహిస్తున్న నాలాలోని వరదను పరిశీలిస్తున్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, తదితరులు


జవహర్ కాలనీలో వరద తాకిడికి కొట్టుకుపోయిన రోడ్డు


హనుమకొండ శ్రీవెంకటసాయి కాలనీలో వరదకు కొట్టుకుపోయిన రోడ్డు


ఇల్లు శుభ్రం చేసేందుకు కాల్వ నీళ్లు తీసుకెళ్తున్న స్థానికులు


నయీంనగర్‌లో ధ్వంసమైన రోడ్డు


ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న పోలీసులు


ఇంట్లోకి చేరిన వరద నీటిని బయట పోస్తున్న మహిళ


నయీంనగర్‌లో ఓ కంప్యూటర్ షాపులో తడిసిన కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లను బయట ఆరబెట్టిన నిర్వాహకులు

క్లుప్తంగా

కేయూ హాస్టళ్లు, మెస్‌ల అదనపు డైరెక్టర్‌గా సుచరితపాల్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్లు, మెస్‌ల అదనపు డైరెక్టర్‌గా హెచ్ఆర్ఎం విభాగం కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుచరితపాల్‌ను నియమించారు. వీసీ తాటికొండ రమేష్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

కాజీపేట రైల్వే డీఎస్పీగా శ్రీనివాస్‌రావు



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డీఎస్పీగా శ్రీనివాస్‌రావు పదవీ బాధ్యతలు స్వీకరించినట్లు జీఆర్పీ పోలీసులు శుక్రవారం తెలిపారు. ఇక్కడ డీఎస్పీగా గతంలో పనిచేసిన మల్లారెడ్డి.. అడిషనల్ ఎస్పీగా బదిలీపై వెళ్లినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ కాచిగూడ జీఆర్పీ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రావు పదోన్నతిపై వచ్చి కాజీపేట రైల్వే డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించినట్లు కాజీపేట జీఆర్పీ సీఐ రాంమూర్తి తెలిపారు.

మిల్స్‌కాలనీ సీఐగా సురేష్

మామునూరు: వరంగల్ మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా టీ.సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసి ముస్క శ్రీనివాస్ ఇంతేజార్‌గంజ్ సీఐగా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఖమ్మం కమిషనరేట్ కార్యాలయం నుంచి బదిలీపై సురేష్ వచ్చి బాధ్యతలు చేపట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: నిరుద్యోగులకు ఎకనావికల్ సపోర్ట్ స్కీమ్ ద్వారా రూ.లక్ష (పూర్తి సబ్సిడీతో కూడిన) ఆర్థిక సాయాన్ని అందించేందుకు అర్హులైన క్రిస్టియన్ మైనారిటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మేన శ్రీను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కార్యాలయం, లేదా 040 - 23391067 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సీఆర్‌టీలను రెగ్యులర్ చేయాలి

హన్మకొండ: ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 19ఏళ్లుగా కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులుగా (సీఆర్‌టీ) పనిచేస్తున్న 1804 మందిని క్రమబద్ధీకరించాలని సీఆర్‌టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు సోమేశ్వర్, రాష్ట్ర కోఆర్డినేటర్ దారావత్ బాలాజీ కోరారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

నగరాభివృద్ధిపై ప్రణాళిక లేని ప్రభుత్వం

నయీంనగర్: నగర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ప్రణాళిక లేదని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. హనుమకొండ 54వ డివిజన్ పోచమ్మకుంటలో జలమయమైన కాలనీలను శుక్రవారం పరిశీలించి బాధితులకు భోజన ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని సగానికి పైగా కాలనీల్లో ఇదే దుస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు, బంక సంపత్, పల్లకొండ సతీష్, పల్లె రాహుల్‌రెడ్డి, గుంటి స్వప్న, కూర వెంకట్, రవీందర్ రెడ్డి, సత్యనారాయణ, సతీష్, సుమన్ పాల్గొన్నారు.

రామన్నపేట: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నగరం జలమయంగా మారిందని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలో వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించి వరద బాధితులకు భోజన ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణ, మాజీ కార్పొరేటర్ బుద్ధ జగన్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రావు, నాయకులు చెన్నమల్లు, స్థానికులు బాలకృష్ణ, లక్ష్మణ్, మురళీకృష్ణ, ప్రేమ, మహేందర్, మహేష్, రాజు పాల్గొన్నారు.

హన్మకొండ అర్బన్: భారీ వర్షాల వరదలకు ముంపునకు గురైన నగరంలోని 11, 49వ డివిజన్లలోని పలు కాలనీలను డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సందర్శించారు. డివిజన్లలోని కాలనీవాసులను శుక్రవారం పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించి, వారికి బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ టౌన్ పార్టీ అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్, 62, 63వ డివిజన్ల కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలి, టీపీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రహత్ ఫర్వీనా, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: నగరం వరద ముంపునకు గురికావటానికి అధికారులు, పాలకులే కారణమని సామాజిక కార్యకర్త ఎండీ.ఫసి అన్నారు.

పలువురి పరామర్శ

కరీమాబాద్: వరద ముంపునకు గురైన బీఆర్‌నగర్, రాజీవ్‌నగర్‌ను కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎరబెల్లి స్వర్ణ సందర్శించి బాధితులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. బీఆర్ నగర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్‌బాబు సందర్శించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఎస్ఆర్ఆర్‌తోట వరద బాధితులను బీఆర్ఎస్ నేత రాజనాల శ్రీహరి పరామర్శించి ట్రంకు పెట్టెలతోపాటు పిండి పదార్థాలు అందజేశారు. బీఆర్‌నగర్, రాజీవ్‌నగర్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి సందర్శించారు.

సంక్షిప్తంగా

లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలనడం అన్యాయం

హన్మకొండ: తెలంగాణ లంబాడీలను గిరిజన జాబితా నుంచి తొలగించాలని ఎంపీ సోయం బాపూరావు చెప్పడం అన్యాయమని మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ అన్నారు. శాంతియుతంగా ఉన్న తెలంగాణ ప్రాంతాన్ని మరో మణిపూర్‌గా కాకుండా చూడాలని, ఎంపీ బాపూరావుపై చర్య తీసుకోవాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. తెలంగాణలో 10 శాతంగా ఉన్న గిరిజన జనాభాలో దాదాపు 7 శాతంగా ఉన్న లంబాడీ గిరిజనులను గిరిజన జాబితా నుంచి తొలగించాలని కోరడం బాధాకరమని వాపోయారు.

మైసయ్యనగర్ వాసులను ఆదుకోవాలి

కాశిబుగ్గ: భారీ వర్షాలతో జలమయమై ఇబ్బందులు పడుతున్న మైసయ్యనగర్ వాసులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో పునరావాసం పొందుతున్న మైసయ్యనగర్, ఏసీరెడ్డినగర్‌కు చెందిన బాధితులను శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ స్పందించి బాధితులకు బియ్యం, నిత్యావసరాలు అందించి ఆదుకోవాలని సూచించారు. దుర్గయ్య, రాధ, నీలక్క, సదానందం, మేఘామాల ఉన్నారు.

శభాష్ విజయ్!

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని పెద్దమ్మగడ్డకు చెందిన రాపాక విజయ్ అనే యువకుడిని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ భాషా అభినందించారు. బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి 4వ డివిజన్‌లోని లోటస్‌కాలనీకి చెందిన ఓ కుటుంబం.. ఇంట్లోనే చిక్కుకుంది. అప్పటికే హనుమకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కరుణసాగర్‌తో సహాయక చర్యలో నిమగ్నమైన విజయ్.. ఆ ఇంటిలో ఉన్న ఆరు నెలల బాబు, మహిళ, వృద్ధుడిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చాడు. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కుటుంబాన్ని రక్షించిన రాపాక విజయ్‌ను పలువురు అభినందించరు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కాజాసిరాజుద్దీన్, బీఆర్ఎస్ 4వ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ కంజర్ల మనోజ్‌కుమార్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

హన్మకొండ అర్బన్: వర్షాకాలం వర్షాల కారణంగా సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశం ఉందని, ఈక్రమంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని సాయిబాబా దేవాలయ పరిసర ప్రాంత గుడిసెవాసులకు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యులు పొట్లపల్లి శ్రీనివాసరావు, పాపిరెడ్డి, నారాయణగౌడ్, డాక్టర్ సంధ్యారాణి, ఈవీ.శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు జీవనభృతి కల్పించాలి

మామునూరు: బొల్లికుంట గ్రామ నీరటి ముదిరాజ్ కుటుంబీకులకు జీవనభృతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఖిలా వరంగల్ కార్యాలయం ఎదుట ముదిరాజ్‌లు నిరసన తెలిపి తహసీల్దార్ ఫణికుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బొజ్జం ఉప్పలయ్య, వేలాద్రి, సుధాకర్, రాజయ్య, కుమారస్వామి, రంజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సమైక్యతకు చిహ్నం మొహర్రం

ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయ రాజధాని ఖిలా వరంగల్ కోట పీరీలకు సుమారు 200 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉంది. తెలుగు రాష్ట్రాలే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ముస్లింలు ఇక్కడికి చేరుకుని దర్శించుకోవడం ప్రత్యేకం. హిందూ, ముస్లింల సమైక్యతకు ప్రతీకగా జరుపుకునే ఏకైక పండగ మొహర్రం కావడం విశేషం. మధ్యకోటలో శనివారం జరగనున్న మొహర్రం వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 4గంటల పీరీలకు ప్రత్యేక ప్రార్థనలు చేసి, సాయంత్రం 5గంటల వరకు ఊరేగింపు నిర్వహించనున్నారు. ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ సమీపంలోని కాశికుంట పీరీల బావి వద్ద మత పెద్దలు శాస్త్రోక్తంగా భక్తి ప్రపత్తులతో పూజలు చేసి పీరీలను నిమజ్జనం చేస్తారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

కాశిబుగ్గ: రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్గూరు - నెక్కొండ రైల్వేస్టేషన్ల మధ్య గురువారం రాత్రి చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా సంగెం మండలం బిక్కోజినాయక్ తండాకు చెందిన భూక్య వెంకటేష్ (25) తల్లిదండ్రులతో కలిసి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. తీజ్ పండుగ విషయంలో పక్క తండావారితో గొడవ జరగగా, వారు వెంకటేష్‌పై దాడికి దిగారు. దాంతో మనస్తాపానికి గురైన వెంకటేష్ గురువారం రాత్రి కరీంనగర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి తండ్రి శంకర్‌లాల్ అప్పగించామని సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం

వరంగల్ క్రైం: హనుమకొండ బస్టాండ్ దగ్గర ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు గురువారం రాత్రి ఢీకొనడంతో వరంగల్ ఎల్‌బీ నగర్‌కు చెందిన రఫీక్ అహ్మద్ దుర్మరణం చెందినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. మృతుడి తమ్ముడు మహ్మద్ మిష్బా అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి అమ్మకందారుల అరెస్టు

వరంగల్ క్రైం: ముగ్గురు గంజాయి అమ్మకందారులను అరెస్టు చేసి హనుమకొండ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. నిందితులు ఒడిశా రాష్ట్రం గంజం జిల్లాకు చెందిన సునీల్‌కుమార్, సుకాంత్ నాయక్, మనోజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 19 కిలోలు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

అన్ని విధాలా అండగా ఉంటా..


10వ డివిజన్ ప్రజలతో మాట్లాడుతున్న చీఫ్‌విప్

హన్మకొండ చౌరస్తా: వరద బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ఎవరూ అధైర్య పడొద్దని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ భరోసా కల్పించారు. 9, 10, 11, 29వ డివిజన్లలోని కాకతీయ కాలనీ, అలంకార్, పెద్దమ్మగడ్డ, రామన్నపేట, రంగంపేట ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి వినయ్‌భాస్కర్ పర్యటించారు.

నయీంనగర్: వైద్య చికిత్సకు వెళ్తూ వరదల్లో చిక్కుకున్న వ్యక్తికి గురువారం అర్ధరాత్రి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సహాయం చేశారు. బాధితులను జేసీబీ ద్వారా పోచమ్మకుంట నుంచి నయీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

కరీమాబాద్: వరద బాధితులకు అండగా ఉంటామని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ భరోసా ఇచ్చారు. బీఆర్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, హంటర్‌రోడ్డు ముంపు ప్రాంతాలను తూర్పు ఎమ్మెల్యే నరేందర్‌తో కలిసి సందర్శించారు.

హసన్‌పర్తి: నగరంలోని పద్మశాలి ఫంక్షన్‌హాల్‌లో పునరావాసం పొందుతున్న భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన వరద బాధితులను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ శుక్రవారం పరామర్శించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

హన్మకొండ అర్బన్: సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మిశ్రిన్ సుల్తానా, మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 26న పరకాల పట్టణ కేంద్రంలో చేపట్టిన జీపుజాత నగరానికి శుక్రవారం చేరుకుందని తెలిపారు. ఈమేరకు నగరంలోని జులైవాడలోని ఎస్టీ, ఎస్సీ హాస్టళ్లను సందర్శించిన వారు.. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ హాస్టళ్ల వార్డెన్లు రెగ్యులర్‌గా విధులకు హాజరుకావడం లేదని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని వాపోయారు. చాలా చోట్ల హాస్టళ్లకు సొంత భవనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, మయూరి శేఖర్, మంద కార్తీక్, పవన్, శ్రవణ్, సందీప్, రాజ్‌కుమార్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ జోన్ డీసీపీగా రవీందర్ బాధ్యతల స్వీకరణ

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీగా పి.రవీందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2010 డీఎస్పీ బ్యాచ్‌కు చెందిన రవీందర్ శిక్షణ తర్వాత మొదట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా నియమితులయ్యారు. అనంతరం కరీంనగర్, సీసీఎస్ హైదరాబాద్‌లో డీఎస్పీగా పనిచేశారు. 2017లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది కరీంనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. 2021లో డీసీపీగా పదోన్నతి పొందిన రవీందర్ ప్రస్తుతం సీఐడీ విభాగంలో పనిచేస్తూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఈస్ట్ జోన్ పరిధిలోని అధికారులు, పోలీస్ సిబ్బంది డీసీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీపీని కలిసిన పోలీస్ అధికారులు

డీసీపీ రవీందర్‌తోపాటు పలువురు ఇన్‌స్పెక్టర్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సీపీని కలిసిన వారిలో ఎస్‌బీ సెక్యూరిటీ డీఎస్పీ ఎం.భోజరాజు, ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు పి.దేవేందర్, ఎల్.పవన్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ కె.కుమారస్వామి, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ సింహాచలం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు ఆహారం అందజేత


నిరాశ్రయులకు ఆహారం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ నాగరాజు


వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న కార్పొరేటర్ మానసరాంప్రసాద్